శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## ఎమ్మెల్యే చొరవతో 2 వేల ఎకరాల పంట పొలాలకు తప్పిన ముప్పు



**బిట్రగుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త** బోగోలు-అల్లూరు మండలాల పరిధిలో గల ఉడ్‌హౌస్‌పేట కాలువ వద్ద గుర్రపు డెక్క వల్ల నీటి ప్రవాహం పోక సుమారు 2 వేల ఎకరాల పంట పొలాల రైతులు అల్లాడిపోతున్నారు.సాగునీరు సక్రమంగా ప్రవహించక ప్రతి ఏడాది పంట నష్టపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి ఆ రైతులు తీసుకెళ్లారు. దీనిని గుర్తించిన ఆయన మంగళవారం స్వయంగా ఇరిగేషన్ అధికారులను వెంట పెట్టుకొని రైతులతో సమావేశమై కాలువను పరిశీలించారు. ప్రొక్లెయిన్‌తో గుర్రపు డెక్కను తొలగించేయత్నం చేశారు. ఎమ్మెల్యేనే స్వయంగా ప్రొక్లెయిన్ నడిపి గుర్రపు డెక్కను తొలగిస్తుండటంతో రైతుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఎమ్మెల్యే జోక్యంతో మా కష్టాలు తీరినట్లేనని వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో రైతులు సమస్యలు ఏదైనా వుంటే తన దృష్టికి తెస్తే పార్టీలకతీతంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

## ఎర్రల అక్రమ రవాణా

### కారుతో పాటు సీజ్ చేసిన కోవూరు పోలీసులు



**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** ప్రభుత్వంచే నిషేదించిన ఎర్రలను కారులో అక్రమంగా రవాణా చేస్తుండగా మంగళవారం తెల్లవారుజామున కోవూరులోని జాతీయ రహదారి పెట్రోల్ బంక్ సమీపంలో కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి కారు తనిఖీ చేస్తుండగా ఏపీ 39 యుజి 4809 అనే నెంబర్ గల కారులో రెండు బస్తాలు , రెండు థర్మోకోల్ బాక్సులు కలిగి ఉన్నాయి. వాటిని తనిఖీ చేయగా అందులో నిషేదిత ఎర్రలు ఉండడంతో కారులో ప్రయాణిస్తున్న సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన మట్టిరెడ్డి చక్రవర్తి, దూడల కళ్యాణ్, అక్కినేని కళ్యాణ్‌లను కారుతో పాటు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా గుంటూరుకు చెందిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ పి. మోహన్‌సాయి, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ మేరకు ఎస్సైతో చర్చించి కారుతో పాటు ముగ్గురు నిందితులను, అందులో ఉన్న వేలాది రూపాయలు విలువ చేసే ఎర్రలను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేదిత ఎర్రలు రొయ్య పిల్లల ఉత్పత్తికి ఎంతగానో దోహదపడతాయని, వీటి విలువ కిలో వేలల్లో ఉంటుందని సమాచారం.

## మంత్రి కాకాణి చొరవతో నెరవేరనున్న రైతుల కల

**వెంకటాచలం, డిసెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో రైతుల కల నెరవేరనున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు రైతుల విషయాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల పేర్లు నమోదు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేయించారు. మండల పరిధిలోని గుడ్లూరివారిపాళెం, పుంజులూరుపాడు గ్రామాలకు చెందిన 330 మంది రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పించేందుకు మార్గం సంసిద్ధమైంది. రైతులు 325 ఎకరాల సీజేఎఫ్ భూములను సాగు చేసుకుంటూ జీవించేవారు. సీజేఎఫ్ భూములకు సంబంధించిన ఆర్డీవో పేరు మీద పట్టా ఉండేది. అనుభవదారులుగా రైతుల పేర్లు నమోదు కాబడి ఉంటాయి. ఏళ్ల క్రితం నుంచి పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను సొసైటీ, గత ప్రభుత్వం రద్దు చేసింది.

దీంతో రైతులు గత ప్రభుత్వంలో టీడీపీ అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధుల వద్దకు కాళ్లరిగేలా తిరిగినా రైతుల పేర్లు నమోదు చేయలేదు. సీజేఎఫ్ భూములు రద్దు చేయడంలో అప్పటివరకు అనుభవదారులుగా ఉన్న రైతుల పేర్లు కూడా రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. దీంతో ప్రభుత్వం నుంచి రైతులకు రావలసిన ఎలాంటి పథకాలు కానీ అందలేదు. 2018 సంవత్సరంలో కామినేని చెరువు సమస్యలను రైతులందరూ కలిసి అప్పటి సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విన్నపించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు గ్రామాలకు సంబంధించిన రైతుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. జిల్లా స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కామినేని చెరువు రైతుల సమస్యలను తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రైతులను తాము సాగు చేసుకుంటున్న భూములను అనుభవదారులుగా నమోదు చేయాలని ఆదేశాలు ఇప్పించారు. దీంతో గుడ్లూరువారిపాళెం రైతులు, పుంజులూరుపాడు రైతులు తమ అభినందనలు మంత్రి కాకాణికి తెలిపారు. రికార్డుల నుంచి తొలగించిన పేర్లను మరలా ప్రభుత్వం అనుభవదారులుగా నమోదు చేయడంతో ప్రభుత్వం నుంచి అందే రైతు భరోసా, పంట పరిహారాలు పూర్తి స్థాయిలో లభించనున్నాయి. దీంతో ఆ గ్రామ రైతులు మంత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అంతర్జాతీయ గ్లోబల్ ఇన్నోవేషన్ సదస్సులో పాల్గొన్న లిఖిత్‌రెడ్డి

**నెల్లూరు,డిసెంబరు13 ప్రభాతవార్త-విద్య** డెన్‌మార్క్‌కు చెందిన అన్‌లెష్ నిర్వహించిన గ్లోబల్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో ఆంధ్రా రాష్టం నుండి సిఎంఆర్ యూనివర్శిటీలో బిటెక్ చదువుతున్న పి.లిఖిత్‌రెడ్డి పాల్గొనటం రాష్ట్రాన్నికే గర్వకరాణమని సిఎంఆర్ యూనివర్శిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.మంగళవరాం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు అన్‌లెఫ్ సంస్థ ఐక్యరాజ్యసమతి ద్వారా సస్టైనబుల్ డెవలెప్‌మెంట్ విభాగంలో యవతను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు అన్‌లెష్ కు 100దేశాలనుండి 19000కుపైగా దరఖాసు చేసుకోవటం జరిగిందన్నారు. ఇందులో అత్యధిక ప్రతిభావంతులైన 1000మందిని ఎంపిక చేసి సదస్సుకు ఆవ్వానించారని అందులో తమ యూనివర్శిటీకి చెందిన విద్యార్థి ఉండటం అభినందనీయమన్నారు. ప్రపంచంలో జరుగుతున్న మారుప్పలను ఎప్పటికప్పుడు అవగతం చేసుకుని విద్యార్దులకు ఉత్తమమైన బోదన చేయటం తమ విద్యాసంస్థల ప్రత్యేకత అని వారుతెలిపారు.విద్యార్ధుల్లో దాగి ఉన్న ప్రతిభ, పాఠవాలను వెలికితీసేలా వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన ప్రతిభావంతులకు మైసూర్‌లోని ఇన్ఫోసిస్ ప్రాంగణంలో నిర్వహించే గ్లోబల్ ఇనోవేషన్ ల్యాబ్-2022లో పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సుకు తప్పిన పెను ప్రమాదం




**మర్రిపాడు, డిసెంబర్13ప్రభాతవార్త:** నెల్లూరునుండి ఉదయగిరి వైపు వెళుతున్న ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసి బస్సుకి నెర్ధనంపాడు ఎస్సీ కాలనీ వద్ద అదుపు తప్పి రోడ్డుప్రక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పెద్ద ప్రమాదమే తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## నేడు వ్యవసాయ మంత్రి రాక

**మనుబోలు, డిసెంబరు 13 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కాకాణి గోవర్దన్‌రెడ్డి బుధవారం ఉదయం వీరంపల్లి, కట్టోపల్లి గ్రామాలలో పర్యటిస్తారు. ఈ మేరకు అధికారులకు మంత్రి కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చారు. వీరంపల్లిలో మాండూస్ తుఫాన్‌కు దెబ్బతిన్న రైతుల నారుమడులను వ్యవసాయ మండల అధ్యక్షులు జెట్టి సురేంద్రరెడ్డి మంత్రికి చూపించనున్నారు. అలాగే కట్టోపల్లి గ్రామంలో గుండాల భరత్ మృతి చెందిన తర్వాత వైసిపి నాయకుడు గుండాల ఆదినారాయణను పరామర్శించేందుకు మంత్రి వస్తున్నారని తెలిపారు. అదే సమయంలో లోతట్టు గ్రామాల్లో వరినాట్లను పరిశీలించనున్నారు.

# మునిగిన నారుమడులు పరిశీలన





**మనుబోలు, డిసెంబరు 13 ప్రభాతవార్త** మండలంలోని గురివిందపూడి,కాగితాలపూరు గ్రామాలలో మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పర్యటించారు. మాండూస్ తుఫాన్‌కు దెబ్బతిన్న వరినారుమడులను పరిశీలించేందుకు తహశీల్దార్ సుధీర్, ఎంపిడివో వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టర్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం వుందని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో మరో తుఫాన్ హెచ్చరిక నేపధ్యంలో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. గురివిందపూడి చెరువు నిండి కలుజు ద్వారా మాగాణి భూములలో వరద నీరు చేరిందని రైతులు చెప్పారు. ఆ గ్రామ మాజీ నీటి సంఘ అధ్యక్షులు,వైసిపి నాయకులు మన్నెమాల సుధీర్‌రెడ్డి గ్రామాలలో పోసుకున్న నారుమడులు దెబ్బతిన్న విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. కాగితాలపూరుకు వచ్చిన కలెక్టర్‌కు ఆ గ్రామ సర్పంచ్ చెముడుగుంట ఏడుకొండలు సన్నచిన్నకారు రైతులు మాండూస్ తుఫాన్‌కు నష్టపోయారని వివరించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రావు,పంచాయతీరాజ్ ఎస్ఇ అశోక్‌కుమార్, ఎంపిడివో వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# టిడ్కో గృహ రుణాలు మంజూరు చేయించండి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ గృహాలు అందించే కార్యక్రమంలో భాగంగా నిర్మించిన టిడ్కో గృహాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి, లబ్దిదారులకు త్వరితగతిన గృహాలను కేటాయించాలని అధికారులను కమిషనర్ డి.హరిత ఆదేశించారు. టిడ్కో గృహాల కేటాయింపు ప్రగతిపై మెప్మా నగర పాలక సంస్థ రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి గృహ రుణాలను వేగవంతం మంజూరు చేయించాలని ఆదేశించారు. బ్యాంకులలో రుణాలు రిజెక్ట్ అయిన వారి వివరాలు సేకరించి తిరిగి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. టిడ్కో గృహాలు మంజూరైనప్పటికీ స్వీకరించేందుకు ఆసక్తి చూపని లబ్దిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి గృహాలు కేటాయించేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఇతర ప్రాంతాల్లో తాత్కాలికంగా స్థిరపడిన గృహాల లబ్దిదారులకు సమాచారం అందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి త్వరితగతిన లబ్దిదారులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు కమిషనర్ సూచించారు. మెప్మా పీడీ రవీంద్రబాబు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సెక్రటరీ హేమావతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన



**కొడవలూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:** మాండూస్ తుఫాన్ వలన దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం మరియు ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు కొడవలూరు మండలంలోని, కొడవలూరు, రామన్నపాలెం గ్రామాలలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ వెంటనే పొలాలలో నిలిచిన నీటిని తొలిగించాలనీ తెలిపారు. కొన్ని పొలాలో నారు మరియు నాటిన వరి కుళ్ళి ఉందనీ, నివారణకు కార్బండిజమ్ 2-3గ్రా. ఒక లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలనీ సూచించారు. వర్షాలు వల్ల దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీ ద్వారా వరి విత్తనాలు ఆర్‌బికేల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ మారుతి, దేవి, ఎఆర్ఎస్ శాస్త్రవేత్త పరమశివ, డిఆర్‌సి ఎవో చక్రవర్తి, ఎమ్‌ఎవో సి.హెచ్.ఎస్ లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు కవిత, నిహారిక, పృధ్వి పాల్గొన్నారు.

## కావలి ట్రంకురోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలించిన డిఎస్పీ, కమిషనర్



**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త** కావలి పట్టణ ట్రంకురోడ్డులో రోజురోజుకి ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడంతో ప్రజల ఫిర్యాదులను పురస్కరించుకొని మంగళవారం కావలి డిఎస్పీ వెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డిలు సిబ్బందితో ట్రంకురోడ్డును పరిశీలించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఆర్అండ్‌బి కార్యాలయం వరకు ఈ రెండు శాఖల అధికారులు ట్రాఫిక్‌ను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపుల, రోడ్ల మీద వున్న బండ్లను పరిశీలించారు. డిఎస్పీ వెంకట రమణ, కమిషనర్ శివారెడ్డిలు రోడ్లపై వున్న బంకుల, తోపుడుబండ్ల నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. ట్రంకురోడ్డుపై తమ ఆదేశాలు పాటించని వారిపై చర్యలు చేపడతామని ఈ అధికారులు హెచ్చరికలు చేశారు. ట్రంకురోడ్డులో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సిఐ రాజేష్, ఉదయగిరి సిఐ గిరిబాబు, ఎస్ఐలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మునిగిన నారుమడి పొలాలు పరిశీలన



**సైదాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త:** మాండూస్ తుఫాను వలన కురిసిన భారీ వర్షాలకు మండలంలో నీట మునిగిన నారుమడి పొలాలు, మినుము, పెసర పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని చీకవోలు, అన్నంరాజుపల్లి, కమ్మవారిపల్లి, లింగనపాళెం గ్రామాల్లో నీట మునిగిన నారుమడి పొలాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. దెబ్బతిన్న నారుమడి పొలాలకు సంబంధించి రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పూత దశలో ఉన్న పెసర, మినుము పంటలు మాండూస్ తుఫాను వలన నష్టపోయిన వారికి క్రాప్ డామేజ్ కింద ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆమెతో పాటు రైతులు, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

# ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం



**మర్రిపాడు, డిసెంబర్13ప్రభాతవార్త:** మండలంలోని బ్రాహ్మణపల్లిలో రెండవరోజు మంగళవారం కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి వీధిలో ఆయన పర్యటిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి అందజేసిన సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు అన్ని విధాల సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలకోసం వేలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారన్నారు. లబ్ధిదారుల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్ళి మూడేళ్ళలో ప్రభుత్వం అందించిన ప్రయోజనాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపాలను పరిష్కరించి అర్హులందరికీ లబ్ధిచేకూరేలా చర్యలు చేపడతామన్నారు. సచివాలయ పరిధిలో అభివృద్ధికోసం అందచేసిన 20లక్షల నగదును వినియోగించి ప్రాధాన్యతాక్రమంలో అవసరమైన పనులను మొదలుపెట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు.నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## చెత్తనుంచి సంపదకేంద్రానికి తాళం



**వరికుంటపాడు,డిశంబర్13,ప్రభాతవార్త:** చెత్తనుంచి సంపద తయారీకేంద్రానికి బిల్లులు ముట్టలేదన్న కారణంతో తాళం వేసిన సంఘటన మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామంలో చోటుచేసుకున్నట్లు సర్పంచ్ చల్లకొలుసు నాగరాజు ఎం.పి.డి.ఒ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. 2018వ సంవత్సరంలో చెత్తకేంద్రాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ నిరంకుశధోరణితో వర్కుఅప్రూవల్‌కాకుండానే ఊరికి దూరంగ నిర్మాణం చేపట్టారని కాని అందుకు సంబందించిన బిల్లులు రాకపోవ డంతో చెత్తకేంద్రానికి తాళాలు వేశారన్నారు . గతంలోనైతం ఇలానే తాళాలువేయగ పంచాయతి కార్యదర్శి నోటీసు ఇచ్చిందని నేడు కాంట్రాక్టర్ మరోమారు తాళాలు వేశారన్నారు. దీంతో స్పందించినఎం.పి.డి.ఒ, ఎ.పి.ఒ.శ్రీనివాసులను పిలిపించి అందుకు సంబందించిన పూర్తివివరాలు అందజేయాలని సంబందిత షెడ్‌ను పరిశీలించి సత్వరచర్యలు చేపడతామని సర్పంచ్‌కి హామీయిచ్చారు.

## ప్రతిరైతుకు నష్టపరిహారం అందేల చూస్తాం



**వరికుటపాడు,డిశంబర్13,ప్రభాతవార్త:** మాండూస్ తుఫానువల్ల నష్టపోయిన ప్రతిరైతుకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎ.డి.ఎ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వరికుంటపాడు, రామాపురం, టి కొండారెడ్డిపల్లి, రొంపిదొడ్లగ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, మినుము, కుసుమ, సోయాబీన్, శనగ, వరి పంటలను పరిశీలించారు. ప్రతివక్కరైతు రబీసీజ న్‌లో సాగుచేసిన పంటలను ఈక్రాపు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎ.ఇ కిరణ్, వి.ఎ.ఎలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అనూహ్య, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన గణిత నమూనా



**మర్రిపాడు,డిసెంబర్13ప్రభాతవార్త:** మండల స్థాయి సైన్స్‌ఫేర్‌ను మర్రిపాడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో నందవరం ఆదర్శపాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన మ్యాత్‌మెటికల్ మోడలింగ్ విభాగంలో పైథాగరస్ సిద్ధాంతాన్ని ఉపయోగించి సముద్ర జలాల్లో తిమింగలాలను కాపాడే గణిత నమూనాను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గణిత ఉపాధ్యాయుడు సరస శ్రీనివాసకుమార్ మార్గదర్శకంలో 10వ తరగతి విద్యార్థినులు అనన్య చరిత, కుసుమ, హిబ్జా, శ్రీలక్ష్మీ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ శారదాకుమారి, స్కూల్‌కమిటీ చైర్మెన్ చిట్టెం రాధ లు విద్యార్థులను అభినందించారు.

## డప్పు కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలి

**ఆత్మకూరు,డిసెంబర్13ప్రభాతవార్త:** కుల వివక్ష పోరాట సమితి అధ్యక్షుడు, సిఐటియు జిల్లా కౌన్సిల్ నాయకుడు ఆత్మకూరు నాగయ్య ఆధ్వర్యంలో మంగళవారం డప్పు కళాకారులు తమకు పెన్షన్ మంజూరు చేయాలని ఆత్మకూరు ఎంపిడిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని దేపూరు గ్రామానికి చెందిన డప్పు కళాకారులు పి.శ్రీరాములు, బి.పెంచలయ్య, కె.దేవదాసులతో కలసి వినతిపత్రం అందజేశారు. కులవృత్తిగా చర్మ వృత్తితో చెప్పులు కుట్టుకుంటూ జీవినం చేస్తూ అలాగే డప్పు వాయిస్తూ జీవనం సాగించే తమకు డప్పు కళాకారులకు అందించిప పెన్షన్ మంజూరు చేయాలని ఎంపిడిఒ ను కోరారు. గత ఏడాది రెండు దపాలు అర్జీలు ఇచ్చామని ఈసారైనా వీరి పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని నాగయ్య కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మోచర్ల పోలేరమ్మ దేవస్థానంలో దొంగతనం

**గుడ్లూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త :** మండలంలోని మోచర్ల పోలేరమ్మ దేవస్థానంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయం గ్రామస్తులు చూసే సరికి గుడి తలుపులు తీసి లోపల చిదరబం దరగా ఉండటంతో ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఖరీదైన వస్తువులు దొంగతనం జరిగినట్లు స్థానికులు తెలుపుతు న్నారు. అయితే గతంలో మూడు సార్లు ఈ దేవాలయంలో దొంగతనం జరిగినట్లు సమాచారం. ఐదో నెంబరుకు దగ్గర ఉండటంతో దొంగతనాలు ఎక్కువసార్లు జరిగినట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసే బాగుండేదని పలువురు స్థానికులు తెలుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన టిడిపి నాయకులు

**బుచ్చి డిసెంబర్ 13 ప్రభాతవార్త:** గతకొద్ది రోజుల నుండి మాండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొలాలనుతెలుగుదేశం పార్టీ పార్లమెంట్ రైతు అద్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. సంగం మండలంలో దువ్వూరు, బుచ్చి రెడ్డిపాళెం మండలంలో కాగులపాడు, పెనుబల్లి, మినగల్లు గ్రామాలలో పొలాలను పరిశీలించి ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఇరిగేషన్ అధికారులు స్పందించి పూడిపోయిన కాలువలు పూడిక తీయించాలని డిమాండ్ చేశారు.



## ఆసుపత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలి



**కలిగిరి, డిసెంబర్13, ప్రభాతవార్త:** ప్రవేటు ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను ఉంచాలని, ఆసుపత్రులకు వచ్చే పేషట్లను ప్రేమగా చూడాలని కలిగిరి మండలాధ్యక్షురాలు మెట్టుకూరు శిరీషారెడ్డి తెలిపారు. కలిగిరి ప్రభుత్వ వైద్యశాల అద్వజరీ కమిటీ సమావేశం మంగళవారం కలిగిరి పిహెచ్‌సిలో జరిగింది. ఈసమావేశానికి వైద్యశాల డాక్టర్‌తోపాటు మండల తాసిల్దారు మిగిలిన అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న యంపిపి మాట్లాడుతూ వైద్యశాల శుబ్రంగా ఉంచాల్సి న బాద్యత శిబ్బందిపై ఎంతైనా ఉందన్నారు. కొద్దిగా ఆరోగ్యం బాగలేకపోయినా ప్రజలు ప్రవేటు వైద్యశాలలకువెళ్తున్నారన్నారు. అదే ప్రభుత్వ వైద్యశాలపై వైద్యాదికారులు నమ్మకం కలిగించాలన్నారు. ఈ ప్రాతంలో అదికంగా మద్యతరగతి ప్రజలు ఉన్నారన్నారు. వారికి మంచి వైద్యం అందించాల్సి న భాద్యత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్యతగ్గిందని రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవిదంగా కృషిచేయాల్సి న భాత్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. నాడు నేడు కార్యక్రమంలో వైద్యశాలకు అనుకున్నరీతిలో పనులు జరగలేదని డాక్టర్ యంపిపి దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. 108శిబ్బంది ఉండేందుకు వసతికల్పించాలని యంపిపి దృష్టికి తెచ్చారు. ఈకార్యక్రమంలో కరలిగిరి సర్పంచి రాగి దివ్య వైద్యశాల డాక్టర్ గీతారెడ్డి, తెల్లపాడు యంపిటిసి సబ్యురాలు మారెళ్ల దొరసానమ్మతదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ అబివృద్ధిపై శిక్షణా తరగతులు

**కొండాపురం, డిశెంబర్13, ప్రభాతవార్త:** కొండాపురం మండలంలో గ్రాల అబివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని యంపిడిఓ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారంయంపిడిఓ కార్యాలయంలో పలు పంచాయితీల ప్రజాప్రతినిదులు ,సర్పంచిలు, కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా యంపిడిఓ మాట్లాడుతూపంచాయితీల అబివృద్ధికి ప్రణాళికలు శిద్దంచేయాలన్నారు. అబివృద్ధి లక్ష్యాలను సాదించడానికి ప్రస్తుతం ఉన్న పథకాలు నవరత్నాలు, ఉపాది పథకం, నాడునేడు, జలజీవన్ మిషన్, విద్య, వైద్యంసంభందిత పథకాలు ద్వారా అబివృద్ధి సాదించే దిశగా ప్రణాళికలు తయారు చేసుకో వాలన్నారు. అందరి బాగస్వామ్యంతో గ్రామాలు అబివృద్ధి చెందుతాయని అందుకు ముందుగా ప్రణాళికలు శిద్దంచేయాలన్నా ఈ కార్యక్రమంలో యంపిపి బొద్దు అనూరాద, యంపిటిసి సబ్యులు ,సర్పంచిలు, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులుదళితనాయకుడు మాత్రమే



**విడవలూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విడవలూరు మండలం పార్లపలి ్ల గ్రామానికి చెందిన పూళ్ళ శ్రీనివాసులు అనే వ్యక్తి తన తల్లికి సంబంధించిన పొలం విషయంలోఉన్నటు వంటి సమస్య తహసిల్దారు చంద్రశేకర్ దృష్టికి పలుసార్లు విన్నవించుకున్నా పరిష్కారం జరలేదని తెలిపారు. ఈ పరిస్థితులలో కావలి ఆర్‌డిఒకి తెలియజేయడం జరిగిందని శ్రీనివాసులు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తాను అనేక భూ పోరాటాలలో పాల్గొన్నాని జిల్లా దళిత భూ ఉద్యమ నాయకుడుగా పనిచేశానని చెప్పారు. అయితే ఒక పత్రికలో తనని మాజీ మావోయిస్టు అని వ్రాయడం జరిగిందని, నేను మావోయిస్టు కాదని శ్రీనివాసులు తెలిపారు. సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ బాస్కర్ బాబు వద్ద శ్రీనివాసులు ఈ విషయాన్ని విన్నవించుకోగా విచారించిన సిఐశ్రీనివాసులు మావోయిస్టు కాదని వారితో ఎటువంటి సంబంధంలేదని కేవలం దళిత నాయకుడని స్పష్టం చేశారు.

## రైతులు నష్టపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



**విడవలూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విడవలూరు మండలంలో మాండూస్ తుపాన్ ప్రభావం మరియు ప్రభుత్వాధికారుల నిర్ల్యం వలన 12 వందల ఏకరాలకు నష్టం వాటిల్లిందని టిడిపి నాయకులు సత్యంరెడ్డి ,ఎం శ్రీనివాసులురెడ్డి, ఎన్ సుబ్రహ్మణ్యం, ఆరోపించారు. నష్టాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించనందువల్ల పంట కాలువలకు చేపట్టవలసిన మరమ్మత్తులు పనులు చేయడానికి ఎవ్వరు ముందుకు రావడం లేదని వారు ఆరోపించారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులకు తెలియజేసినా స్పందన లేదని అన్నారు. నష్టపోయిన రైతులందర్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న రోజులలో ముందుగా కాలువల మరమ్మత్తులు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## 16నుంచి గడపగడప పై సమీక్షా సమావేశం

**చేజర్ల,డిసెంబర్13ప్రభాతవార్త:** చేజర్ల మండలంలోని 6సచివాలయాల్లో ఈనెల 16నుంచి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్.విజయలలిత పేర్కొన్నారు. ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సమావేశాలకు హాజరవుతారని ఆమె తెలిపారు. 16న కోటితీర్థం, తూర్పుకంభంపాడు, 21న మైపాటివారికండ్రిక, 22న ఆదూరుపల్లి, 23న చేజర్ల, బోడిపాడు, 27న చిత్తలూరు, 28న పాడేరు, గొల్లపల్లి, తిమ్మాయపాళెం పంచాయతీల పరిధిలోని సచివాలయంలో మధ్యాహ్నం 2-30గంటలకు సమీక్షాసమావేశం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. వాలంటీర్లు వారి కస్టర్లలో ఏదైనా పథకాలు పెండింగ్‌లో ఉన్నా, సమస్యలున్నా లబ్ధిదారులకు తెలిపి గ్రామసభకు హాజరయ్యేలా చూడాలని ఆమె పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని , ఆయా పంచాయతీలకు సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేసుకొని ఉండాలని ఆమె కోరారు.

## ఆక్రమణ తొలగించాలని వినతి

**సీతారామపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త:** గుండుపల్లి హరిజనవాడకు చెందిన మాముడి భాస్కర్ కుటుంబానికి చెందినసర్వేనెంబర్ 83-2లో ఉన్న భూమిలోకి వెళ్లేందుకు రహదారి సమస్యనుతీర్చాలని మంగళవారం సచివాలయంలో పంచాయితీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు తమకుటుంబానికి చెందిన ఏకరా 20 సెంట్లు అన్నదమ్ముల భూములు సమానంగా పంచుకోగా అందులోనుండి తమ సోదరి మామిడి రాహిలమ్మకు 2 సెంట్లు కేటాయించారని ఆ 2 సెంట్లలో ఆమె నివాసం ఏర్పరచుకొనుటకు వెళ్లే రహదారిలో మామిడి రామక్క అనే మహిళ రహదారిని అక్రమించి ప్రహరీ గోడ కట్టడమైంది. ఈ విషయమై కార్యదర్శికి విన్నవించుకోగా సెక్రటరీ చర్య తీసుకుంటామన్నారు.

## రీసర్వేకు డాక్యుమెంట్లతో హాజరు కావాలి



**చేజర్ల, డిసెంబర్13ప్రభాతవార్త:** గ్రామాల్లో సర్వే చేయబోయే సర్వే నెంబర్లను రెండురోజులు ముందుగా గ్రామంలో తెలియజేస్తామని ఆ భూములకు సంబంధించిన యజమానులు వారి డాక్యుమెంట్లతో సర్వేకు హాజరు కావాలని రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ మొలతాటి గిరీష్ పేర్కొన్నారు .మంగళవారం వావిలేరులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఓఆర్ఐ మ్యాప్ , రోవర్లని తీసుకోవడం జరిగిందన్నారు. 113 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ రీసర్వేలో భూ యజమానులు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. రైతులందరూ సహకరిస్తే రీసర్వే సజావుగా జరగడంతోపాటు భూయజమానులు వారికి సంబంధించిన హక్కులను పూర్తిస్థాయిలో పొందుతారని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష పథకంలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తామన్నారు .భూ యజమానులు తమ సరిహద్దు, చుట్టూ అడ్డంకులను తొలగించి హద్దులను చూపితే భూమికి సంబంధించిన వారి వద్ద ఉన్న పత్రాలతోపాటు తమ రికార్డులను కూడా పరిశీలించి వారికి భూ యాజమాన్య హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గోనుగుంట రాంబాబు, పంచాయతీ కార్యదర్శి యర్రగడ్ల సురేష్, విఆర్ఒ పెంచలయ్య, సర్వేయర్లు మనోజ్, ఉమ్మర్, కీర్తన, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు .

## నేడు పెన్షనర్స్‌కు క్రీడా పోటీలు

**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త:** ఆలిండియా పెన్షనర్స్ డేని పురస్కరించుకొని కావలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు బుధవారం ఉదయం 9 గంటలకు కావలి మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ కావలి అధ్యక్షులు ఆకుల రమణయ్య తెలిపారు. పెన్షనర్లందరూ ఈ పోటీలలో పాల్గొనాలని ఆయన కోరారు.

## గీతామందిరం వద్ద స్కూటీలో ఐదు లక్షల యాభై వేలు చోరీ



కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త కావలి పట్టణ రైల్వే రోడ్డులోని గీతా మందిరం వద్ద నిలిపిన స్కూటీ వాహనంలో గుర్తు తెలియని వ్యక్తులు ఐదు లక్షల యాభై వేల రూపాయలు నగదు చోరీ చేసి పోలీసులకు సవాళ్లు విసిరారు. కావలి పట్టణానికి చెందిన దామా మాల్యాద్రినాయుడు ఎస్‌బిఐ బ్యాంకు నుంచి ఐదు లక్షల 50 వేల రూపాయలు నగదు తీసుకొని స్కూటిలో పెట్టుకున్నాడు. ఆ స్కూటిపై రైల్వే రోడ్డులోని గీతా మందిరం వద్దకు వచ్చాడు. మందిరం దగ్గర బండి పార్కు చేసి కృష్ణ పరమాత్ముడిని దండం పెట్టుకునేందుకు ఆలయంలోకి వెళ్లాడు. బయటకు రావడం ఐదు నిమిషాలలో స్కూటిలో వున్న ఐదు లక్షల 50 వేల రూపాయలు చోరీ కావడంతో ఖంగుతిన్నాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ ఎస్ఐ మహేంద్ర యాదవ్ గీతా మందిరం వద్ద తనిఖీలు నిర్వహించారు. మందిరం ఎదురుగా వున్న షాపులో సిసి పుటేజ్ చూశారు. ఈ సంఘటన మధ్యాహ్నం 3.30 గంటల సమీపంలో జరిగింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటులో వున్న రైల్వే రోడ్డులోని గీతా మందిరం వద్ద రౌండ్‌దిక్లాక్ జనసంచారం కల్గిన ప్రాంతంలో పట్టపగలు దుండగులు చోరీ చేయడం తీవ్ర సంచలనం సృష్టించింది. చోరీ వార్త దావాలనంలా వ్యాపించడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు.

## శ్రీ సాయి డిగ్రీ కళాశాల అడ్రస్సుతో నకిలీ ఎమ్మెల్సీ ఓట్లు



**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని 127వ పోలింగ్ బూత్‌లో శ్రీ సాయి డిగ్రీ కళాశాల అడ్రస్సుతో 171 ఎమ్మెల్సీ ఓట్లు నమోదయ్యాయని ఈ దొంగ ఓట్లపై విచారణ జరిపి తొలగించాలని ఎమ్మెల్సీ అశోక్‌బాబు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాను కలిసి దొంగ ఓట్ల జాబితాను, వినతి పత్రాన్ని అందజేశారు. నకిలీ ఓట్లను తొలగించడంతో పాటు సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇదే కళాశాల అడ్రస్సుపై 500 ఓట్లు నమోదు చేశారన్న విషయాన్ని కూడా ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నగళ్ళ శ్రీనివాసకిరణ్ కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ కావడం, వైసిపి నేతగా పేరు గడించడంతో ఈ ఓట్ల బాగోతం ఫిర్యాదు తీవ్ర సంచలనం సృష్టించింది. కావలి ఎమ్మెల్సీ రాజకీయాలలో ఈ నకిలీ ఓట్ల దుమారం చర్చనీయాంశమైంది.

## గీతా మందిర కృష్ణుడు గ్రామోత్సవం

**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త** కావలి పట్టణ రైల్వే రోడ్డులోని గీతా మందిరంలో జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణ వేడుకలలో భాగంగా మంగళవారం శ్రీకృష్ణ పరమాత్ముడి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక వాయిద్య బృందాలు, నృత్యాల మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి వారికి అలంకారాలు, హోమ పూజలు





వేద పండితులు నిర్వహించారు. పుణ్యాహం, అక్షిమోచనం, నవకలశ స్నపన, పంచగవ్యాధివాసం, అధివాస హోమం, యజమాన ఆశీర్వచనం, పుణ్యాహం, అగ్నిప్రతిష్ట, కలశస్నాపన, ఉక్తహోమం, యజమాన ఆశీర్వచనాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని సద్వినియోగం చేసుకోవాలి



**కావలి రూరల్, డిసెంబరు 13 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కావలి సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు యం.శ్రీరామరాజు తెలిపారు. కావలి పెద్దచెరువు కట్ట వద్ద వున్న శివరామ సుబ్బయ్య గిరిజన కాలనీలో యం.శ్రీరామరాజు ఆధ్వర్యంలో ఆయన స్వీయ నిధులతో 50 మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసి 80 మంది నిరుపేద గిరిజనులకు భోజన వసతి కల్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో అన్ని సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయన్నారు. ఇంకా ఎవరికైనా అందకపోతే తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యేకు తెలియజేసి అందే విధంగా కృషి చేస్తానన్నారు. పిల్లల భవిస్యత్ కోసం వారికి విద్యను అందించాలని అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మీ పిల్లలను బాగా చదివించి వారికి మంచి జీవితాలను అందించాలన్నారు. మీకు అండగా వుండి చేతనైన సహాయం అందించాలని ఎంతో కాలంగా కావలి సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. గిరిజనుల జీవనశైలి మారి అన్ని రంగాలలో ముందుండాలన్నదే నా ఆశయమన్నారు. గిరిజనులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజనులకు దుప్పట్లు, భోజన వసతి కల్పించినందుకు కావలి సేవా సమితి అధ్యక్షులు యం.శ్రీరామరాజును పలువురు అభినందించారు. గిరిజనులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి సేవా సమితి సభ్యులు మనోజ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి



**ఉదయగిరి డిసెంబర్ 13 ప్రభాతవార్త** ఉదయగిరి గ్రామ పంచాయితీలోని బిట్-1,బిట్-2 సచివాల యాలను ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ సందర్శించారు. గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన గ్రామ పంచాయితీ పరిధిలోని జరిగి వలసిన ప్రత్యేకశానిటైజేషన్ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు.రోడ్లపైన నీరు నిలువ ఉండకుండా చూడాలని కాలువలలో పూడికతీతలు తీయాలని తగు సూచనలు చేశారు. అదే విధంగా ఉదయగిరి మండలంలోని 17 గ్రామ పంచాయితీ కార్యదర్శులు శాని టేజేషన్ వర్క్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉదయగిరి మండలానికి 177 కొత్త పెన్షన్లు మంజూరు అయ్యాయని వాటిని రీవెరిఫికేషన్ చేయవల్సిందిగా ఉన్నతాధికారులు సూచించారని తెలిపారు. ఇప్పటికే 60 పెన్షన్లు రీ వెరిపికేషన్ జరిగినట్లు మిగతా పెన్షన్లు 17వ తేది లోపు రివేరిఫికేషన్ పూర్తిచేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నరసయ్య,మండల కో ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్, శానిటైజేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలమ్మ నిలువ నీడ కోసం అగచాట్లు



**బిట్రగుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త** బోగోలు మండలం ఎస్వీపాళెం దళితవాడలో నిరుపేద కుటుం బమైన పొంగులూరు పోలమ్మ నిలువ నీడ లేక వర్షానికి, ఎండకు తీవ్ర ఇబ్బంది పడుతుంది. ఈమెకు ప్రభు త్వం 2014 సంవత్సరంలో పక్కా గృహాన్ని మంజూరు చేసింది. అయితే పైకప్పు వేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేక పక్కనే పూరిపూకలో నివసిస్తుంది. భర్త అనారోగ్యంతో మంచం పట్టి వుండటంతో తనకున్న 25 సెంట్ల భూమిని అమ్మి కుమార్తెకు వివాహం చేసింది. ప్రస్తుతం దాతలు ఎవరైనా స్పందించి ఆర్థిక సహా యం చేస్తే అసంపూర్తిగా వున్న గృహాన్ని పూర్తి చేసుకుంటానని వేడుకుంటుంది. అధికారులు, ప్రజాప్ర తినిధులైనా స్పందించి ఆమె మొర ఆలకించాలని కోరుకుంటుంది.

## రక్తదానం ఇతరులకు ప్రాణదానంతో సమానం



**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** రక్తదానం చేయడమనేది ఇతరులకు ప్రాణదానంతో సమానమని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా సామాజిక సేవా కార క్రమాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లా డుతూ తమ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ద్వారా ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్య క్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. యువత ఇటువంటి రక్తదాన శిబిరంపై ప్రత్యేకంగా అవగాహన చేసుకుని స్వచ్ఛ రక్తదాతలు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానంపై యువతలో ఉన్న అనేక సందేహాలను పూర్తిగా అవగాహన కల్పించేందుకే ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 300 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందించారు. ఈ సందర్భంఆ రెడ్‌క్రాస్ ప్రతినిధి డాక్టర్ యశోవర్ధన్, రెడ్‌క్రాస్ వలంటీర్ సాయిరామ్, నెల్లూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిప్యూ టీ వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాసగుప్తాలను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా సత్కరించి సన్మానం చేశారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై. మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## ముగిసిన పంచాయతీ అభ్యిద్ధి ప్రణాళికపై శిక్షణ



**వింజమూరు,డిసెంబర్13ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికా శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమై మంగళవారంతో ముగిశాయి. అన్ని శాఖల అధికారుల సమీక్ష ,ఆయా శాఖల ద్వారా నిధుల వినియోగం, అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేశారు. జిల్లా రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధులను ఆధారంగా చేసుకొని ప్రస్తుతం తయారుచేసిన ప్రణాళికలను అనుసరించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధిని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసన్నకుమారి, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపిటిసి సభ్యులు, ఎపిఒ, ఎపిఎం, మండల రెవెన్యూ అధికారులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రానికి ఉషా నర్సింగ్ హోమ్ డాక్టర్ విరాళం

**బిట్రగుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి మంగళవారం కావలి ఉషా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ సతీష్ పది వేల రూపాయల విరాళాన్ని అందించారని ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎటువంటి గ్రాంటు లేకపోయినా దాతల సహకారంతో ఆదరణ కేంద్రానికి తనవంతు సహాయం ఎల్లప్పుడు చేస్తానని హామీ ఇవ్వడం పట్ల డాక్టర్ సతీష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాభివృద్ధికి పారదర్శక ప్రణాళిక అవసరం




**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనించాలంటే పారదర్శక ప్రణాళిక అవసరమని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సంవృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామంగా తయారు కావాలి. అదేవిధంగా ఆరోగ్య వంతమైన నీటి సంవృద్ధి కలిగిన పచ్చదనం, పరిశుభ్రత కలిగిన సుపరిపాలనతో కూడిన గ్రామం తయారయ్యేందుకు ప్రణాళికబద్ధమైన ఆచరణ తప్పనిసరి అన్నారు. ఐకేపీ డీపీఎం కామాక్షి సెర్ప్ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలపై వారిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ తమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలు, జలజీవన్ మిషన్ మంచినీటిని ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలు ఆర్‌బీకే ద్వారా అందిస్తున్న సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

## చెరువును పరిరక్షించుకోవాలి



**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** కోవూరు చెరువు కట్ట అలుగు కలుజును మంగళవారం బీజేపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా ఈ కలుజులో నీరు ఉధృతంగా ప్రవహించడంతో కోవూరు వైపు నుంచి పాటూరు, గుమ్మలదిబ్బ, యల్లాయపాలెం, దామరమడుగు కు వెళ్ళ ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంతోమంది నాయకులు మారుతున్నా ఈ కలుజు మాత్రం మార్చ్యా నాథుడే లేకపోయారన్నారు. ఎన్నికలు వస్తే మాత్రం వాగ్దానాలతో కాలం సాగదీస్తున్నారన్నారు. ఈ కలుజు ప్రాంతంలో వంతెన నిర్మాణం చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. చెరువు నుంచి నీటి పారుదల కాలువలు సక్రమంగా పూడిక తీయకపోవడంతో నీరు సక్రమంగా పోక రైతుల పొలాల్లోకి నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వరినాట్లు, నారులు పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రఘురామయ్య, ఉపాధ్యక్షుడు పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి నగేష్, నేతలు శ్రీకాంత్, మల్లికార్జున, రమణారెడ్డిలు ఉన్నారు.

## సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగకరం



**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు రావాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని అరుణ తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలుగా భవిష్యత్తులో తయారు కావాలన్నా ఇటువంటి ప్రదర్శనలు వారికి తొలిమెట్టుగా ఉపయోగపడతాయన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఐదు ప్రదర్శనలను ఎంపిక చేసి వాటిని జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా మందులు వాడాలి



**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఉన్న రోగులు తప్పనిసరిగా మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు సచివాలయాల పరిధిలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీ రాంజనేయ స్వామి దేవస్థానంలో మార్గశిర మంగళవారం పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం నాగవల్లి పత్రాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా నాగలక్ష్మి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో రుత్వికులు జయప్రకాష్ స్వామి, నందకుమార్ స్వామి, తదితరులు ఉన్నారు.

## నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు



**వింజమూరు,డిసెంబర్13ప్రభాతవార్త:** మాండూస్ తుఫాన్ వలన కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మినుము, పచ్చిమిర్చి , పచ్చిశనగ పంటలను మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్ కదిరి వెంకటరం గారావ్, కలిగిరి మండల బిజెపి అధ్యక్షులు కల్లూరి చంద్రమౌళిలు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ వలన రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. నియోజకవర్గంలో మెట్టపంటలైన మినుము, పచ్చిశనగ, పచ్చిశనగ పంటలు మునిగిపోవడంతో రైతులు ఆరుగాలం పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైందన్నారు. అనేక చోట్ల రైతులు ప్రధానమంత్రి పసల్ భీమా యోజన నమోదు చేయలేదని వాపోతున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు సేవచేయాలనే ప్రకటనలు గుప్పిస్తూ ఆర్‌బికెలను ఏర్పాటు చేశారన్నారు. కానీ ఆర్‌బికెల్లో పనిచేస్తున్న సిబ్బంది కనీసం పంట పరిశీలనకు కూడా వచ్చిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి రైతుపక్షపాతి అని చెబుతున్నారే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు .ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపధికన పంటనష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వారికి పరిహారం అందించాలన్నారు కె.శ్రీనివాసులు, లెక్కల మాలకొండారెడ్డి, నారపరెడ్డి రాజా, రైతులు పాల్గొన్నారు.

## కాలేరిగుంట గిరిజన కాలనీలో బిర్యానీ, దుప్పట్లు పంపిణీ



**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త** కావలి పట్టణ కాలేరిగుంట గిరిజన కాలనీలో మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో గుప్తదాతల సహకారంతో మంగళవారం పేదలకు బిర్యానీ ప్యాకెట్లు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు, వైసిపి నేత కుందుర్తి శ్రీనివాసులు, గౌరవ సలహాదారుడు యం.మాలకొండారెడ్డి, కోటా రాజశేఖర్‌రెడ్డి, ఆవులమంద శ్రీనివాసులు, కత్తి సందీప్, పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాలేరిగుంట గిరిజన కాలనీలో నివసిస్తున్న నిరుపేదలకు ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు తమ సంస్థ ఆధ్వర్యంలో అందజేసేందుకు కృషి చేస్తామని రాయపాటి దిలీప్‌కుమార్ తెలిపారు.

## వెయ్యి మొక్కలు నాటిన సంయుక్త సేవా సంస్థ



**కావలి, డిసెంబరు 13 ప్రభాతవార్త** సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో ఒక్క సంవత్సరంలో వెయ్యి మొక్కలు నాటడం ఎంతైనా అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. కావలి పట్టణం బాపూజీనగర్ కమ్యూనిటీ సెంటర్‌లో మంగళవారం 45 మొక్కలు నాటడంతో వెయ్యి మొక్కల లక్ష్యంనెరవేరినట్లయింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బుర్లారఘుకుమార్‌రెడ్డి,శ్రీ మేధజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.అశోక్‌బాబు,డైరెక్టర్ తిరుపతయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.వెంకట సాయితేజ, కె.సుబ్బయ్య, షేక్ హసీనా తదితరులు పాల్గొని మాట్లాడారు. సంయుక్త సేవా సంస్థ 2022 సంవత్సరంలో వెయ్యి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్న నినాదంతో ఈ కార్యక్రమం మొదలైందన్నారు. నేటికి వెయ్యి మొక్కలు నాటడం చెప్పుకోదగ్గ విశేషమన్నారు. గంగపట్నం సురేంద్ర పట్టుదలకు ఇది నిదర్శనమన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవలు అభినందనీయమన్నారు.

## పాఠశాలకు పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం



**జలదంకి, డిశంబర్13,ప్రభాతవార్తః**తాము చదువుకున్న పాఠశాలను మరువకుండా చదువులతల్లి అభివృద్ధిలో మేముసైతం అంటూ వారందిస్తున్న సహకారం ఎంతోఅభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి కొనియాడారు.మంగళవారం జలదంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 1996,2001బ్యాచ్ పూర్వపువిద్యార్థులు వడ్డే.శ్రీనాద్‌రెడ్డి,పెట్లూరి.ప్రభాకర్,కుట్టుబోయిన.మనోహర్‌యాదవ్,తమ్మిశెట్టి.మనోహర్ తదితరులు పాఠశాల హెచ్.ఎం కొండారెడ్డిని కలశారు.స్కూలు పరిస్తితులు పిల్లల చదువులు అభివృద్ధి తదితరాలను అడిగితెలుసుకున్నారు.తమవంతు వితరణగా 25వేల రూపాయలను అందజేస్తున్నట్లు తెలియజేశారు.నగదును వారిచేతులమీదుగ ఆయనకు అందజేశారు.అప్పటికి ఇప్పటికి పాఠశాల ఎంతో అభివృద్ధిచెందిందని అలాగే పదవతరగతి పరీక్షలలో మంచిఫలితాలను సాధిస్తూ పిల్లలు పాఠశాల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేస్తు న్నారని సంతోషం వ్యక్తంచేశారు.మునుముందు మరింత మెరుగైన ఫలితాలను తాము ఆసిస్తున్నామని అందుకు మీరుచేస్తున్న కృషి అద్భుతమని హెచ్.ఎం కొండారెడ్డని శ్లాఘించారు.ఉపాద్యాయులు కూడా తమవంతు తపన పడడం సంతోషించదగ్గదని అన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గాడి. కోదండరామిరెడ్డి తదితర ఉపాద్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణాతరగతులు



**వరికుంటపాడు,డిశంబర్13,ప్రభాతవార్తః** గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై జరుగుతున్న శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి.ముందుగ ఎం.పి.డి.ఒ విజయభాస్కర్‌రావు నేతృత్వంలో అంబేత్కర్,గాందీజి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎం.పి.డి.ఒ ఆద్వర్యంలో సర్పంచ్‌లు,సచివాలయ సిబ్బంది వైద్యసిబ్బందికి సమగ్రశిక్షణనిచ్చారు.క్షేత్రస్తాయిలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు,అమలుపరస్తున్న సంక్షేమపదకాలగూర్చి వివరించారు.ఈకార్యక్రమంలో ఎం.ఇ.ఒ షావుద్దీన్,ఎ.పి.ఒ శ్రీనివాసులు,సర్పంచ్‌లు దిలీఫ్‌కుమార్,గురువారెడ్డి,సి.హెచ్.ఒ రాజశేఖరరాజు పాల్గొన్నారు.

# సోలార్ పంపుల వివరాలను ప్రశ్నించిన వేమిరెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త** రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నవంబర్ 22 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్) కింద అందించబడిన సోలార్ పంపుల వివరాలు తెలియజేయాలని కోరారు. జిల్లాల వారిగా ఇవ్వాలని అన్నారు. మంత్రిత్వశాఖ ఇప్పటికే గ్రిడ్-కనెక్ట్ చేయబడి ఉన్న వ్యవసాయ పంపుల సోలారైజేషన్‌ను కూడా అందిస్తుందనే విషయం వాస్తమేనా అని ఆయన ప్రశ్నించారు. అక్టోబర్ 2022 నాటికి రాష్ట్రంలో ఇప్పటి వరకు సోలారైజ్ చేయబడిన వ్యవసాయ పంపుల సంఖ్య, 2024 నాటికి కనీసం 50 శాతం వ్యవసాయ పంపు సెట్‌లను సోలార్ పంపు సెట్‌లుగా మార్చేందుకు తీసుకున్న,తీసుకోవాల్సిన చర్యలను తెలుపమని ప్రశ్నించారు.అందుకు స్పందించిన కేంద్రమం త్రి ఆర్.కె .సింగ్ పిఎం-కుసుమ్ మంత్రికిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ స్కీమ్ అనేది డిమాండ్ ఆధారిత పథకం మరియు రాష్ట్రం నుండి వచ్చిన డిమాండ్ ఆధారంగా స్కీమ్ కింద సామర్ధ్యాలుయొక్క కేటాయింపులు జరపడ్డాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి డిమాండ్ లేనందున స్వతంత్ర సోలార్ పంపుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పిఎం-కుసుమ్ పథకం యొక్క కాంపోనెంట్ -బి ద్వారా ఎటువంటి కేటాయింపులు జరలేదు. ఇప్పటికే ఉన్న గ్రిడ్ అనుసంధానిత వ్యవసాయ పంపుల సోలారైజేషన్ పిఎం-కుసుమ్ పథకం యొక్క కాంపోనెంట్-సి కింద కవర్ చేయబడింది.పిఎం -కుసుమ్ పథకం కింద 31.3.2026 తేది నాటికి 35 లక్షల పంపుల సోలారైజేషన్ లక్ష్యం నిర్దేశించబడింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ది మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యూవబుల్‌ఎనర్జి (ఎంఎన్ఆర్ఇ) ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, ప్రచారం అవగాహన కల్పించడం, వి క్రేతల సంఖ్యను పెంచడానికి టెండర్ షరత్తులు సరళీకృతం చేయబడ్డాయి. టెం డర్లు జారీ చేయడానికి రాష్ట్రాని అనుమతి ఉంది.కేటాయించిన సామర్ధ్యాన్ని పూర్తి చేయడానికి కాల వ్యవధి 24 నెలలకు పెరిగింది. అగ్రికల్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద చేర్చడం,ఆర్‌బిఐ యొక్క ప్రాధాన్యత రంగరుణ మార్గదర్శకాల కింద చేర్చడం.

## సంగమేశ్వరుని సన్నిధిలో అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన



**సంగం డిసెంబర్ 13 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని సంగమేశ్వరుని సన్నిధిలో అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణానికి దాతలుగ్రామస్తులు శంకుస్థాపన చేశారు. అర్చకులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు.పెద్ద ఎత్తున ప్రజలు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాగం గిరిబాబు మాట్లాడుతు అయ్యపస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇవ్వాలని కోరారు.

## సంక్షేమ ఫలాలు క్షేత్ర స్థాయిలో అందించేందుకు అధికార యంత్రాంగం పనిచేయాలి



**బిట్రగుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త** గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో లబ్దిదారులకు అందేలా తరచు పరిశీలన చేయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని నాగులవరం పంచాయతీలోని నాగులవరం, చెన్నారెడ్డిపాళెం గ్రామాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులు తమకు సక్రమంగా పథకాలు అందేలా చూడాలని ఆయనను వేడుకోగా మండలంలో ప్రతి శాఖకు చెందిన అధికారులు సచివాలయాలను తనిఖీ చేసి వార్డుల వారీగా ఎవరికి ఏ పథకం అందు తున్నది, అందకపోవడానికి కారణాలు ఏమిటి పరిశీలించాల్సి వుందన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా పార్టీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందించకుండా పారదర్శకంగా అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ఆయన వెంట మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎండివో గోవిందరావు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

# వరినాట్లు, మడులు మునిగి నష్టపోయిన రైతులు



**నెల్లూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త-వైద్యం** నీటి పారుదల కాలువల్లో పూడికలను తొలగించకపోవడంతో వరినాట్లు, నారు ముడులు నీట ము నిగి తీవ్రంగా రైతులు నష్టపోయారని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్ల మెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల.వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. మంగళ వారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు రోజులుగా మౌండూస్ తుఫాను కార ణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేల ఎకరాల్లో వరి నాట్లు, నారు మడులు, పత్తి, వేరుశనగ, మినుము, మిరప తదితర పంటలు కూడా పూర్తిస్థాయిలో దెబ్బతిన్నా య న్నారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలతో రైతాంగం అల్లాడిపోతున్నారన్నారు. డెల్టా ప్రాంతంలో వైసీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత గత మూడున్నరేళ్ళలో నీటి పారుదల కాలువల్లో పూడిక తీయించి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదని ఆయన ఆరోపించారు. కనీసం కాలువలకు మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడం దారుణమన్నారు. దీనిని బట్టి చూస్తుంటే అసలు నీటి పారుదల శాఖ ఉన్నదో లేదో కూడా తెలియని పరి స్థితి రైతుల్లో నెలకొందన్నారు. నీటి పారుదల అధికారులు ఎప్పటికప్పుడు పూడికలు తీసి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్నారు. వర్షాల కారణంగా చాలా ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయన్నారు. తక్షణ మే వారిని ఆదుకోవాలని చేజర్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలను పక్కన పెట్టి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని టీడీపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

# అటెండర్, స్వీపర్ బదిలీలకు కౌన్సిలింగ్



**నెల్లూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త- వైద్యం** జిల్లాలోని 52 పిహెచ్‌సీల పరిధి లో పనిచేస్తున్న అటెండర్, స్వీపర్, వా చ్‌మెన్, ఎంఎన్ఓ తదితర నాలుగో త రగతి పోస్టులకు సంబంధించి వర్క్ అడ్జ స్ట్ కింద పలువురిని బదిలీ చేసేందుకు మంగళవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యా లయంలో కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం .పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన 143వ జీవో ప్రకారం ఒక్కో పిహెచ్‌సీలో డాక్టర్లతో సహా మొత్తం 12 మంది సిబ్బంది మాత్రమే ఉండాలన్నారు. అయితే అందులో స్వీపర్లు, వాచ్‌మెన్, అటెండర్, ఎంఎన్ఓ తదితర వారికి సంబంధించి ఒక్కరు మాత్రమే పిహెచ్‌సీలో ఉండా లన్నారు. ఒక్కరి కన్నా ఎక్కువ ఉన్న వారిని గుర్తించి కౌన్సిలింగు ద్వారా ఖాళీగా ఉన్న పిహెచ్‌సీకి వర్క్ అడ్జస్ట్ కింద బదిలీ చేశామని ఆయన తెలిపారు. మొత్తం 27 మందిని బదిలీ చేశారు.

## బీసీ నూర్‌భాషా, దూదేకుల రాష్ట్ర సాధికార సమితి సభ్యుడుగా ఖాదర్‌భాషా



**నెల్లూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబునాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరపు.అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారిక సమితి రాష్ట్ర సభ్యుడుగా షేక్.ఖాదర్‌భాషా, నెల్లూరు జిల్లా కన్వీనర్‌గా షేక్.సుభాన్‌భాషాలను నియమించారని, ఈ సందర్భంగా వారు మంగళవారం తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిలో ఆయనను కలిసి కోటంరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పార్టీకి విధేయులుగా ఉంటూ పార్టీ గెలుపుకు కృషి చేయాలని వారికి సూచించారు. అనంతరం వారు కోటంరెడ్డిని శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో షేక్.హాజరత్‌అలీ, షేక్.అబ్దుల్‌సలీమ్, షేక్.షరీఫ్, షేక్.జహీర్, షేక్.నిర్మల్, కే.అబ్దుల్‌బాషా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌డిఆర్ పనులలో కోట్లు దోచుకున్నారు



**సీతారామపురం డిసెంబర్ 13 ప్రభాతవార్త** మండలంలోని స్వామి చెరువు తూముకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని రాష్ట్ర బిసి కార్పోరేషన్ డైరక్టర్‌వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర పంచాయితీరాజ్ వింగ్ పిసి అల్లూరు రాజు అధికారులను కోరారు. మంగళవారం సీతారామపురంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతు ఇటీవల కాలంలో ఆయకట్టు గల చెరువుల మరమ్మత్తుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన ఎఫ్‌డిఆర్ నిధులను సక్రమంగా వినియోగించి వుంటే ప్రస్తుతం కురిసిన వర్షాలకు చెరువుల తూములు లీకై నీరు వృదాగా పోయే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. అధికారులు,కాంట్రాక్టర్లు కుమ్మకై తూతూ మంత్రంగా ఎఫ్‌డిఆర్ పనులు చేపట్టి కోట్లాదిరూపాయాలు దోచుకున్నారని ఆరోపించారు. చెరువు మరమ్మత్తుల పనులు అదికారుల పర్యవేక్షణ లేకపోవడం నాణ్యత ప్రమాణాలు లోపించినందుకు కాంచెరువు తూము లీకేజి నిదర్శనమని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులకు,గుంటలకు, నీరు పుష్కలంగా చేరుతున్నప్పటికి తూము లీకేజితోనీరు వృదాగా పోతుంటే రైతులు ఆవేదన చెప్పులోనేదని అన్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖ ఉన్నతాధికారులు యుద్ద ప్రాతిపదికన స్పందించి స్వామి చెరువు తూము లీకేజిని అరికట్టి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి నేలటూరు అబ్రహాం,రైతులు పాల్గోన్నారు.

# నష్టపోయినా మంత్రి, అధికారులు స్పందించారా



**నెల్లూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త-వైద్యం** మౌండూస్ తుఫానుతో వరినాట్లు, నారు మడులు మోకాటి లోతు నీటిలో మునిగిపోయి ఉన్నా కనీసం వ్యవసాయశాఖామంత్రి కాకాణి.గోవర్ధన్‌రెడ్డి, అధికారులు స్పందించకోవడం దారుణమని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్ అజీజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు పాత వెల్లంటి, కొత్తవెల్లంటి గ్రామాల్లో నీట మునిగిన వరి పంటపోలాలను అబ్దుల్‌అజీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలో పంట పోలాలు మనిషి లోతు నీరు చేరి పంట పూర్తిగా కుళ్ళిపోయిందన్నారు. నెల్లూరు జిల్లాలో ఈ సీజన్లో అధికారికంగా, అనధికారికంగా 12లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తారని, ప్రతి రైతు ఎకరాకి పది నుంచి పదిహేను వేలు ఖర్చు పెట్టి ఉన్నారన్నారు. ఈ రాష్ట్రంలో 65శాతం వ్యవసాయంపై ఆధారపడి రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో కాలువల్లో పూడిక తీయడం కాలువలు శుభ్రపరచడం మీదే ఎక్కువ శాతం దృష్టి సారించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇక్కడ ఉన్న సైఫన్‌ను ముందుగానే శుభ్రపరచి ఉంటే ఇంతటి స్థాయిలో రైతులకు నష్టవాటిల్లేది కాదన్నారు. పంట పొల్లాలోకి నీరు చేరేవి కావన్నారు. పంటలన్నీ నాశనం అయ్యాక జేసీబీలు తెచ్చి ఇప్పుడు పూడికలు తీయడం ఏమిటని ప్రశ్నించారు. సౌత్‌మోపూరులో ఒక పక్క 50 ఎకరాల్లో మనిషి లోతు వరద చేరిందని, వాటిని తీస్తే మరోవైపు ఉన్న 150 ఎకరాలు మునిగి పో తా యన్నారు. రాష్ట్రంలో పంటలు బాగా పండినా కొనే నాధుడేలేదని, కొన్న డబ్బులు ఎప్పుడు ఇస్తారో తెలీయ దని ఎద్దేవా చేశాడు. 850 కిలోలకు రూ.16,900లు ఇవ్వాల్సి ఉండగా, 1100 కిలోలకురూ. 16,900 ఇస్తున్నారని మొత్తం కలిపి చూస్తే వచ్చే గిట్టుబాటు ధర పది నుంచి రూ.12వేల వరకు మాత్రమే ఉందన్నారు. పంటలు వేసి రైతుల నష్టపోతే కనీసం వారికి ధైర్యం చెప్పేవారే కరువయ్యారన్నారు. వ్యవసాయశాఖామంత్రి కాకాణి.గోవర్ధన్‌రెడ్డి కొంతమందిని మాత్రమే పంట పండించమని చెప్పడం సిగ్గుచేటన్నారు. దేశంలో పంట పండించే రైతుల ఆత్మహత్యలో ఏపీ రెండో స్థానంలో ఉందని అబ్దుల్ గుర్తు చేశారు. రైతులు పంటలు నష్టపోయి దారుణమైన పరిస్థితులను ఎదుర్కుంటుంటే ఉంటే కనీసం కాకాణి, అధికారులు కాని రాకపోవడం ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదన్నారు. అన్నం పెట్టే రైతు రోధించడం ప్రజలకు, రాష్ట్రానికి మంచిది కాదన్నారు. గతంలో ఇలాగే తుఫాను తీవ్రతతో పంటలు నష్టపోతే కేవలం నాసిరకమైన విత్తనాలు ఇచ్చారని అజీజ్ ఆరోపించారు. గతంలో వరదలు వచ్చినప్పుడు పంట పొల్లాల్లోకి ఇసుక చేరిందని, వాటిని అధికారులు పరిశీలించారే తప్ప ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలరు తీసుకోవాల్సిన ప్రభుత్వం తీసుకోకపోగా రైతులు నష్టపోయాక కూడా ఇప్పటికీ స్పందించకోవడం హేయమైన చర్యన్నారు. పంట నష్ట శాతాన్ని అంచనా వేసి, గతంలోలా నాసిరకమైన విత్తనాలు ఇవ్వకుండా అందరికీ నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి సారంగి.గున్నయ్య, జలదంకి.సుధాకర్, దొడ్డపనేని.రాజానాయుడు, మేకల.నరేంద్రరెడ్డి, పముజుల.ప్రదీప్, సుధాకర్‌గౌడ్, ఎర్రయ్య, శ్రీనివాసులురెడ్డి, జేవీఆర్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్శింహులు కుటుంబాన్ని ఆదుకోవాలి



**మర్రిపాడు, డిసెంబర్13ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం అల్లంపాడుకు చెందిన దళిత రైతు కోలా నర్శింహులు గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. స్థానికంగా మిర్చి పంటను సాగుచేసిన నర్శింహులు మండలంలో ఇటీవల ఏర్పడిన బంగాళాఖాతంలో ఏర్పడిన అప్పపీడనం మాండూస్ తుఫాన్ వలన తీవ్రంగా నష్టపోయాడు. దీంతో ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతుసంఘం నాయకులు మూలి వెంగయ్య కోరారు . మిర్చి పంటమీద వేలకువేలు పెట్టుబడిని అప్పుగా తీసుకొని సాగుచేశాడు. మాండూస్ తుఫాన్ వలన మిర్చిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన నర్శింహులు గుండెపోటుతో మృతిచెందాడని నర్శింహులు మృతితో కుటుంబం వీధిన పడిందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రభుత్వం పరంగా నర్శింహులు కుటుంబాన్ని ఆదుకోవాలని మూలి వెంగయ్య కోరారు.

# పొంగుతున్న మిడతవాగు..రాకపోకలకు అంతరాయం

**కొండాపురం డిశెంబర్13,పభాతవార్త;** ఇటీవల కురిసిన తుపాన్ కారణంగా కొండాపురం మండలంలోని సత్యఓలు, అగ్రహారం సమీపాన పారీ మిడత వాగు పొంగి పొర్లు తుంది. గతరాత్రికురిసిన అతిభారీ వర్షాలకు అదిక నీరు చేరడంతో వాగు దాటేవీలులేకుండాపోయింది.దీనితో రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది.ఈ సమాచారం తెలుసుకున్న కొండాపురం యస్ఐ ఖాజావలి తమ శిబ్బందితో అక్కడికి చేరుకొని పరిస్తితినిసమీక్షించారు.ఎవ్వరినీ వాగు దాటనీయకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వెంటిలేటర్‌పై వైకాపా ప్రభుత్వం



**నెల్లూరు,డిసెంబరు13 ప్రభాతవార్త-విద్య** రాష్ట్రం పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలనే ఇందుకు కారణమని జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడాన్ని నిరశిస్తూ మంగళవారం నగరంలోని స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉద్యోగులకు మద్దత్తుగా జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆందోళణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అనాలోచిన నిర్ణయాలు, అర్ధంలేని సంక్షేమాలు చేపతూ ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. డిసెంబరు నెల వచ్చి 15 రోజులు కావస్తున్నా ఇంకా గత మాసం జీతాలు ఇవ్వలేని దుస్దితిలో రాష్ట్రం ఉందని ఎద్దేవా చేశారు. అభివృద్దిని మరిచి అప్పులు చేసి మరీ ప్రజలు అడగని సంక్షేమాలను చేస్తూ యువత భవిష్యత్‌లో జగన్ నాశనం చేశారని ఆరోపించారు. ఆర్‌బిఐ ఓవర్ డ్రాఫ్ట్‌ను ప్రభుత్వం ఎప్పుడో అధిగమించిందని, అప్పులు చేయటంలో ఆంధ్రా దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఇంతటి దయనీయ స్దితిలో రాష్ట్రాన్ని ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు కోరి తెచ్చుకున్న సచివాలయ వ్యవస్థకు రాజ్యాంగ బద్దత కలిగించి టీచర్లను ఎన్నికల విధులనుండి తోలగించటం దారుణమన్నారు. సచ్చివాలయ ఉద్యోగుల ద్వారా రానున్న ఎని కల్లో విజయం సాధించాలని జగన్ బావిస్తున్నారన్నారు. రాష్ట్ర ఉద్యోగులకు చులకనగా చూడటం మంచి పద్దతి కాదని వెంటనే వారికి జీతాలు మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. అత్యధిక స్థానాల్లో ప్రజా ప్రతినిధులకు గెలిపించుకుని ముఖ్యమంత్రి అయిన జగన్ కొద్ది రోజుల్లోనే ప్రజల చీతా కరాలను ఎదురో కన్నారని ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ జనసేన తప్పక విజయం సాధిస్తుందని దీమా వ్యక్తంచేశారు. ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలని లేకుంటే తమ ఆందోళణలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బద్దిపూడి సుధీర్, అధికార ప్రతినిధి కలువాయి సుధీర్,జిల్లా కార్యదర్శులు షేక్ ఆలియా, గుడిహరిరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, నాయకులు మణికంఠరెడ్డి, వినయ్‌కుమార్, సుల్తాన్‌బాషా, జీవన్, శ్రీధర్, సురేష్, అశోక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై మంత్రి బొత్స,సజ్జలను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



**నెల్లూరు,డిసెంబరు13 ప్రభాతవార్త-విద్య** విద్యారంగంలో నెలకొన్న సమస్యలతోపాటూ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. విజయవాడలో ఈమేరకు వినతిపత్రాలను రాష్ట్రవిద్యాశాఖమంత్రి బోత్స సత్య నారాయణ, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, దనుంజయ్‌రెడ్డిలను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు ఉపాధ్యాయ బదిలీల్లో కొన్ని సవరణలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో ఆలస్యాన్ని వారికి వివరించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరటం జరిగిందన్నారు. జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, కెజీబీవీ, మెడల్‌స్కూల్స్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉన్న ఆర్టఅండ్ క్రాఫ్టు ఉపాధ్యాయుల క్రమబద్దీకరణ, మినిమం టైం స్కేల్ వంటి సమస్యలను పెద్దలకు వివరించటం జరిగిందన్నారు. అలాగే ప్రయివేట్ పాఠశాలల అనుమతులు అంశంలో గతంలో ఉన్న 10 సంవత్సరాల అనుమతులను ప్రసుతం 5 సంవత్సరాలకు తగ్గకుండా ఇచేందుకు కృషి చేస్తునా మని ఆయన తెలిపారు. అద్యాపకుల సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, వైఎస్ఆర్‌టిఎఫ్‌రాష్ట్ర అధ్యక్షులు జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో సైన్స్‌ఫేర్ ప్రారంభం



**సైదాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని హై స్కూల్ నందు ప్రధానోపాధ్యాయురాలు పార్వతమ్మ అధ్యక్షతన మండల విద్యాశాఖ ధాకారి మండల స్థాయిలో సైన్స్ ఫేర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 7ఉన్నత పాఠశాలలకు సంబంధించి ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు 5 ప్రాజెక్టులను తీసుకురావడం జరిగిందని ఎం ఈవో దయాకర్‌రావు తెలిపారు.ఈ సైన్స్ ఫేర్‌కు సంబంధించి మండలం నుంచి ఐదు మందిని ఎంపిక చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు డివిడి కుమార్, ఉమాశంకర్, మాధవీలత, సౌజన్య కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు నగరంలో... నెల్లూరు క్రైమ్, సంతపేట, దర్గామిట్ట,బారకాసు, కొండాపురం మండలంకు విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031